## నేరము శిక్ష

**అద్దం ముందు నిల్చుని అందాలకు మెరుగులు దిద్దుకొంటోంది కావ్య. ముఖ్యంగా తను వేసుకున్న డ్రస్ మరీ మరీ సరిచూసుకుంది.**

**రేపు జరిగే ఫ్యాషన్ పెరేడ్ లో రాంప్ పై ఎలా నడవాలో ప్రాక్టీస్ చేస్తోంది. ఒకసారి వయ్యారంగా నడుం ఊపుతూ హంసలా నడుస్తోంది. మరోసారి లీవిగా పరుగెత్తే జింకలా అడుగులేస్తోంది.**

**ఇంతలో కావ్య ఫ్రెండ్ మోహిత్ అక్కడకు చేరుకున్నాడు. అతనో మోడల్ ఫోటో గ్రాఫర్.**

**వస్తూనే ''వాహ్...గుడ్ క్యాట్ వాక్ ప్రాక్టీస్ చేస్తున్నావ్...''**

**''ఈ డ్రస్ బాగుందా....?'' మురిపెంగా అడిగింది కావ్య.**

**''బాగానే ఉంది కాని....'' అని నఖశిఖపర్యంతం కావ్యను ఓసారి తేరిపార చూసి-**

# మాయాజాలం

**- ఆదిత్య**

''చూడు కావ్య ఫ్యాషన్ పెరేడ్‌లో అందరూ చూసేది కేవలం నీ డ్రస్‌ని మాత్రమే కాదు...''

''మరి....?'' అమాయకంగా అడిగింది.

''నీ అందాల్ని కూడా అంతే ఆసక్తిగా అక్కడ వచ్చిన వాళ్ళందరూ చూస్తారు. ఇప్పుడు నువ్వు వేసుకున్న డ్రస్ నీ అందాలకు అడ్డుగా ఉన్నాయి. నీ డ్రస్ నీ అందాల్ని బహిర్గతం చేసేదిగా ఉండాలి.... చూస్తున్న వాళ్ళ కళ్ళు చెదిరిపోవాలి... అప్పుడే అందరినీ ఆకట్టుకోగలుగుతావు. ఉండు చెబుతా.....'' అంటూ చొరవగా కావ్య గుండెలను నిండుగా కప్పి ఉన్న వస్త్రాన్ని నిర్దాక్షిణ్యంగా మరో నాలుగంగుళాలు కత్తిరించేసాడు.

''ఇప్పుడు చూసుకో'' అంటూ అద్దం ముందుకు తోసాడు.

నిజంగా చాలా తేడా కనిపించింది. తన అందాలు తనకే కొంగ్రొత్తగా కనిపించసాగాయి.

''థ్యాంక్స్....'' అంది మురిపెంగా.

''ఉత్త థ్యాంక్స్ మాత్రమేనా...?'' బుంగ మూతి పెడుతూ అన్నాడు మోహిత్.

''మరేం కావాలి...''

''చిన్ని ముద్దు కావాలి...'' అన్నాడు మోహిత్ మూతి సున్నాలా చుట్టి.

''నో...నో... అలాంటివన్నీ పెళ్ళితరువాతే...''

''అంతేనా...'' అలుగుతూ అన్నాడు తను.

''చిన్న పిల్లాడిలా ఏవిటా మారాం...'' అంటూ మోహిత్ నుదుటిపై సున్నితంగా ముద్దు పెట్టుకుంది కావ్య.

క్షణాల్లో ఉలిక్కిపడ్డాడు మోహిత్.

''మోసం.... మోసం...'' అంటూ తలూప సాగాడు మోహిత్.

''ఇందులో మోసం ఏం లేదుగాని... రేపు ఏడు గంటలకల్లా ఓబెరాయ్ షెరటాన్‌కు వచ్చేయ్......''

''అలాగే విష్‌యూ ఆల్‌ద బెస్ట్....'' అన్నాడు బుద్ధిమంతుడిలా తలూపుతూ.

★★★

ధగ ధగా కళ్ళు మిరిమిట్లు గొలిపే దీప కాంతుల మధ్య జరుగుతోందా ఫ్యాషన్ పెరేడ్.

చెవులు హోరెత్తే మ్యూజిక్‌తో మారుమ్రోగి పోతోంది ఓబెరాయ్ షెరటాన్ ఆవరణ.

ర్యాంప్ మీద అమ్మాయిలు హొయలొలికిస్తూ నడుస్తుంటే చూస్తున్న కుర్రకారు కేరింతలు కొట్టసాగారు. ఆ ఆవరణ అంతా ఉల్లాసభరితంగా, ఉత్సాహంతో ఊగిపోతోంది.

కావ్య హంస గమనంతో ర్యాంప్ మీద నడుస్తుంటే మెరుపు తీగ నడిచినట్లే ఉంది.

చూస్తున్న వాళ్ళు అందరూ చప్పట్లతో అభినందించారు.

గంటసేపు ఆ షో అలా సాగింది.

ఆ షోలో కావ్య విజేతగా నిల్చింది. ప్రైజ్ తీసుకొని గ్రీన్ రూమ్‌కి వెళ్ళి డ్రస్ మార్చుకుంటుంటే కిటికీ రెక్క టపటపా కొట్టుకోవడం కనిపించింది.

ఆ గదిలో ఇంకెవ్వరో ఉన్నారన్న అనుమానం వచ్చింది కావ్యకు. వెంటనే డ్రస్ సరిచేసుకొని కిటికీ దగ్గరకొచ్చి చూసింది. ఎవరో ఆగంతకుడు గేటు దూకి పారిపోవడం కనిపించింది.

ఇంక చేసేదేమి లేక ఇంటికి బయలుదేరింది కావ్య.

★★★

కాలేజీకి బయలు దేరుతుంటే కావ్య సెల్ మోగింది. సెల్ ఆన్ చేసింది. తనకొచ్చిన మెసేజ్‌ను చూస్తూనే తన కాళ్ళ క్రింది నేల రెండుగా చీలినట్టుగా అనిపించింది కావ్యకు.

ఆ వెంటనే ఓ స్వరం కర్కశంగా ''చూసావుగా నీ అందచందాల విశ్వరూపం... చాలా సెక్సీగా ఉంది కదూ...'' అనడం వినిపించింది.

''యు....బ్రూట్.... ఎవడ్రా నువ్వు నా ముందుకు రారా... చెప్పుతో కొడతాను...'' ఆవేశంగా అరిచింది కావ్య.

''కూల్ బేబి... ఎందుకలా గొంతుచించు కుంటావు... ఇప్పుడేం జరిగిందని....నీకు మాత్రమే మెయిల్ చేసా... ఇంకెవ్వరికీ పంపగూడదంటే నువ్వో చిన్న పనిచేయాలి....''

''ఏం చేయాలి...?''

''జస్ట్.... ఓ యాభైవేలు కొట్టావంటే చాలు నీ ముందే డిలీట్ చేస్తా... ఏంటీ ఆలోచిస్తున్నావు. కోటీశ్వరుడి కూతురివి ఈ డబ్బు నీకో లెక్క కాదనుకొంటా...మళ్ళీ సరిగ్గా గంట తరువాత చేస్తా'' అంటూ కట్ చేసాడు ఫోన్.

ఉక్రోషంతో బెడ్ మీద పడిపోయి వెక్కివెక్కి ఏడ్చింది కావ్య. ఏడుస్తూ కూర్చుంటే లాభం లేదనుకొని కాలేజీకి బయలుదేరింది.

దారిలో కావ్య క్లోజ్ ఫ్రెండ్ సుస్మిత కలిసింది.

విచారంగా ఉన్న కావ్యను చూసి ''ఏం జరిగిందే అలా ఉన్నావు ఒంట్లో బాగాలేదా'' అడిగింది.

విషయం చెప్పాలా వద్దా అని సంశయిస్తున్న కావ్యకు చెబితేనే తన బాధ కొంచెం తగ్గుతుం దనిపించి తనకొచ్చిన ఫోన్ గురించి వాళ్ళడిగిన డబ్బు గురించి చెప్పి-''ఏం చేయమంటావే'' సలహా అడిగింది కావ్య.

''వీలైనంత త్వరగా ఈ పీడ వదుల్చుకోవడమే మేలు కావ్య....'' అంది సుస్మిత.

''డాడీకి చెప్పాలా వద్దా అని ఆలోచిస్తున్నా''


''ఒద్దు.... ఒద్దు....పెద్ద వాళ్ళను క్షోభపెట్టిన వాళ్లమవుతాం....''

''మరి అంత డబ్బు ఎలా... సమకూర్చడం?''

''ఆలోచిస్తే అసాధ్యమయింది ఏదీ లేదు...'' అంటూ కావ్య ఒంటి మీద నగల వైపు చూసింది.

అర్థమయినట్టుగా తలూపింది కావ్య. తన నగలు అమ్మేసి సాయంత్రం వేళ ఆగంతకుడు చెప్పిన్నట్లుగా డబ్బుతో చౌపాటి ముందు నిల్చుంది.

కొద్దిసేపటికి చిరిగిన గౌనుతో చిన్న పాప వచ్చి



కావ్య చేతికో చిన్న చీటీ ఇచ్చింది.

అందులో పాప చేతికి కవరిచ్చి వెనక్కి తిరిగి చూడకుండా వెళ్ళి పొమ్మని వ్రాసి ఉంది.

తప్పనిసరిగా డబ్బున్న కవర్ ఆ పాప చేతిలో పెట్టి వెనుతిరిగింది.

''హమ్మయ్య....'' అని ఊపిరి తీసుకొని ఆ రాత్రి గుండెల మీద చేతులు వేసుకొని నిద్దుర పోదామనుకొని బెడ్‌పై వాలింది.

మళ్ళీ ఫోన్ మ్రోగింది.

''హల్లో కావ్య... నిద్దురపోతున్నావా...?'' తనను బ్లాక్‌మెయిల్ చేసిన స్వరం మళ్ళీ వినిపించడంతో ఉలిక్కిపడింది కావ్య.

''ఒరే... నువ్వు కోరిన డబ్బిచ్చానుగా...మళ్ళీ ఎందుకు చేసావు...?''

''డబ్బుకన్నా విలువయిందొకటి నీ దగ్గరుంది అది కావాలి నాకు.....''

''వ్వాట్ నాన్సెన్స్... ఏం మాట్లాడుతున్నావు....?''

''పూర్తి సెన్స్ ఉండే మాట్లాడుతున్నా....నీ సొగసు నా సొంతం కావాలి... ఒక్క రాత్రి నాతో గడిపా వంటే చాలు నా సెల్‌లో ఉన్న నీ అందాలు డిలీట్ చేస్తాను. రేపు రాత్రి హోటల్ సిమ్లా రూమ్ నంబర్ 616 లో నీ కోసం ఎదురు చూస్తుంటాను...'' మరో మాట మాట్లాడకుండా ఫోన్ కట్ చేసాడు అగంతకుడు.

కావ్య గుండెల్లో మళ్ళీ అలజడి. ఎంతోమంది అమాయకులు ఇలా డేగ కన్నులాంటి సెల్ కెమెరాల్లో చిక్కి ఆత్మహత్యోదంతాల గురించి రోజూ పేపర్లల్లో చూస్తోంది.

పరువు, ప్రతిష్టలే ప్రాణంగా తలచే తన తల్లిదండ్రులకెంతటి మానసిక క్షోభ. అదంతా తలుచుకుంటూ ఆ రాత్రంతా నిద్రలేకుండా గడిపింది కావ్య.

తెల్లవారుతుంటే ఓ స్థిర నిర్ణయానికి వచ్చింది. సుస్మితకు ఫోన్ చేసి విషయం తెలియజేసింది.

★★★

హోటల్ సిమ్లాలో రూం నెంబర్ - 616 వెతుకుతూ కారిడార్‌లో నెమ్మదిగా నడుస్తోంది కావ్య. రూమ్ కనిపించగానే బెల్ నొక్కింది ఎలాంటి అలికిడి వినిపించలేదు.

తలుపు తట్టగానే కిర్రుమని తెరుచుకుంది. హాల్‌లో అడుగుపెట్టింది. అక్కడెవ్వరూ లేరు. బెడ్‌రూం తలుపు తెరచి చూసింది... అంతే ఆమె నోట మాట రాలేదు.

బెడ్‌పై ఓ యువకుడు రక్తపు మడుగులో నిర్జీవంగా పడి ఉన్నాడు. దగ్గరికి వెళ్ళచూసింది.

''మోహిత్'' అంటూనే కేకేసి పడిపోయింది కావ్య.

★★★

ఎస్ఐ శౌర్య తన ఎదురుగా కూర్చున్న కావ్యను అడిగాడు.

''నువ్వీ హత్య ఎందుకు చేసావు....?''

కావ్య మౌనంగా ఉండిపోయింది. ఆమె వ్యానిటీ బ్యాగ్‌లోని రివాల్వర్‌ను స్వాధీనం చేసుకున్నారు.

''నోరు మెదపనంత మాత్రాన నువ్వు చేసిన నేరం మాసిపోతుందనుకోకు....''

''మీరు నమ్మినా నమ్మకపోయినా నేను చెప్పేది నిజం. ఆ గదిలోకి వెళ్ళే వరకు అక్కడు న్నది మోహిత్ అన్న విషయం నాకు తెలియదు.''

''ఆ రూమ్‌లో ఎవరున్నా ఆ దుర్మార్గుణ్ణి మట్టు బెట్టాలనుకున్న విషయం మాత్రం నిజం....''

కావ్య చెబుతున్న విషయం ఆసక్తిగా వింటు న్నాడు ఎస్ఐ శౌర్య.

''అసలు మీరిద్దరూ మంచి ఫ్రెండ్స్ అని విన్నాము మరి మోహిత్‌ను ఎందుకు చంపాలను కున్నావు.....''

ఎస్. ఐ. సూటిగా అడిగే సరికి చెప్పాలా వద్దా అని తటపటాయించింది కావ్య. పెదవి కదప లేదు.

★★★

హత్య జరిగిన రూమ్‌నంబర్ 616ను మరో సారి క్షుణ్ణంగా పరిశీలించసాగాడు ఎస్ఐ శౌర్య. బాల్కనీలో ఓ ఎర్రరాళ్ళు పొదిగిన చెవి రింగు కనిపించింది. దాన్ని సేకరించాడు శౌర్య.

అంటే ఈ రూమ్‌లో కావ్య ప్రవేశించక ముందే మరొకరెవరో ఉన్నారు అన్న విషయం ధృవపడింది.

ఆ మరొకరెవరో తెలుసుకోవాలనుకున్నాడు శౌర్య. హోటల్ రిసెప్షన్‌లోని రిజిస్టర్‌లో చెక్ చేసాడు. ఆ రూమ్ రంజిత్ పేరున బుక్ చేయబడి ఉంది. కాని మోహిత్ పేరున లేదు.

అంటే మోహిత్ మారుపేరున బుక్ చేసుకు న్నాడని తెలిసింది. హోటల్‌లోని లేడీస్టాఫ్‌నంతా పిలిచి చెవిరింగు గురించి ఆరాతీసాడు. అది హోటల్ స్టాఫ్ ఎవ్వరికీ చెందింది కాదని తేలింది.

అసలీ హత్యకు కారణం తెలియాలంటే మోహిత్ బ్యాక్ గ్రౌండ్స్ వివరాలు సేకరించాడు. అతనో మోడల్ ఫోటోగ్రాఫర్ అని తెలిసింది. బ్యాంక్ బ్యాలెన్స్ కూడా లక్షల్లో ఉంది.

అంటే అతనికేదో అక్రమార్జన ఉందన్న విషయం స్పష్టమయింది. అతనితో పనిచేసిన ఇద్దరు, ముగ్గురు అమ్మాయిలను విచారించాడు.

★★★

ఎస్ఐ శౌర్య బిజీగా ఉన్న వేళ ఓ అమ్మాయి అతన్ని కలిసి మీతో మాట్లాడాలి అంది.

''ఏ విషయం...?''

''మోహిత్ హత్య గురించి...'' అనగానే నిటారుగా కూచున్నాడు శౌర్య.

''నీ పేరు....?''

''సుస్మిత... చీడ పురుగులాంటి మోహిత్‌ను చంపింది నేనే... వీడు రహస్యంగా సెల్‌ఫోన్ కెమెరాల ద్వారా ఆడపిల్లల ఫోటోలు తీసి బ్లాక్ మెయిల్ చేస్తూ తన పబ్బం గడుపుకుంటుంటే వాడు. అమ్మాయిలను వెంటాడే డేగకన్ను అతని చేతిలోని సెల్‌ఫోన్. నాతో కూడా అలాగే వ్యవ హరించాడు. అలాంటివాడి మాయాజాలంలో చిక్కింది కావ్య. వాడి నీచమైన కోరిక నాకు తెలిపింది. కావ్యను కాపాడాలనుకున్నాను. హోటల్ రూమ్ సర్వీస్ నెపంతో ముందుగా బాల్కనీలో దాక్కున్నాను. మోహిత్ రూమ్‌లోకొచ్చాడు. నేను చూస్తుండగా నా ముందే మరో ఇద్దరమ్మాయిలు శృతి, స్వాతిలకు ఫోన్ చేసి బ్లాక్ మెయిల్ చేయసాగాడు.

నా రక్తం కుతకుతా ఉడికిపోయింది. క్షణం ఆలస్యం చేయకుండా వాణ్ణి షూట్ చేసాను. ఆ క్షణాన భయంతో వెళ్ళిపోయాను. మళ్ళీ ఆలోచించాను. నేకాపాడాలనుకున్న కావ్యకు శిక్షపడకూడదు. అందుకే నన్నరెస్ట్ చేయండి...'' అంటూ తలొంచు కొంది సుస్మిత.

స్నేహితురాలి ఔదార్యానికి నీళ్లు నిండిన కళ్ళతో కృతజ్ఞత తెలిపింది కావ్య.

సుస్మిత కేసు సానుభూతితో పరిశీలిస్తానన్నాడు ఎస్ఐ శౌర్య.

★

